చెత్త తరలింపు..

మురుగు శుభ్రం


పోలీస్‌స్టేషన్ వెనుక వీధిలో చెత్త తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది


సాక్షి ఎఫెక్ట్...

12వ వార్డులో మురుగుకాలువ శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ వేస్తున్న కార్మికుడు

నారాయణఖేడ్: 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన మంగళవారం నిర్వహించిన 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ తక్షణ చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వెనుక వీధిలో వేసిన చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. వివేకానంద కాలనీతో పాటు, 12వ వార్డులో మురుగు కాలువలను శుభ్రం చేశారు. అనంతరం కాలువల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

- డంప్‌యార్డు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని తీర్మానం
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్


డంప్‌యార్డు ఏర్పాటు చేయొద్దని డీఎఫ్‌ఓకు తీర్మానపత్రాన్ని అందజేస్తున్న సభ్యులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మడిదల మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ప్రవీన అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. విద్యుత్ సక్రమంగా సరఫరా కావటం లేదని, విద్యుత్ పోల్స్ లేకపోవటంతో పంట పొలాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్యారానగర్‌లో డంప్‌యార్డు కోసం కేటాయించిన స్థలంలో సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను గ్రామస్తులు, రైతులు అడ్డుకున్న విషయాన్ని సభలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ ప్రవీన ప్రస్తావించారు. పంట పొలాల మధ్య ఉన్న గ్రామంలో డంప్‌యార్డును ఎలా ఏర్పాటు చేస్తారని సభ్యులు అధికారులను ప్రశ్నించారు. డీఎఫ్‌ఓ శ్రీధర్‌రావు, ఫారెస్టు రేంజ్ అధికారి రవీంద్రబాబును సమావేశానికి రావాలని సభ్యులు కోరటంతో వారు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డంప్‌యార్డును ఏర్పాటు చేయొద్దని సభలో తీర్మానం చేసి డీఎఫ్‌ఓ శ్రీధర్‌రావుకు సభ్యులు తీర్మాన పత్రాన్ని అందజేశారు. పరిశ్రమల నుంచి రాత్రి సమయంలో వ్యర్థజలాలను పారబోస్తుండటంతో సమీపంలోని కుంటలు, చెరువుల్లో కలుస్తున్నాయని సభ్యులు పీసీబీ అధికారి అజయ్‌కు వివరించారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ సమావేశంలో దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మంజుల, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న ఎంపీపీ సుశీల

కల్హేర్(నారాయణఖేడ్): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ గుర్రపు సుశీల, జెడ్పీటీసీ నర్సింహారెడ్డి అన్నారు. కల్హేర్ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం పనులు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సూచనలు చేశారు. అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఎంపీడీఓ సంగ్రామ్, తహసీల్దార్ బాలశంకర్, ఎంఈఓ శంకర్, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఘని, సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, కిష్టారెడ్డి, లక్ష్మినారాయణ, ఎంపీటీసీలు కిషన్‌నాయక్, సంగప్ప పాల్గొన్నారు.

విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వాలి


కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సంగారెడ్డి అర్బన్: ఫీజుల పేరుతో హాల్‌టికెట్ ఇవ్వకుండా విద్యార్థులను వేధించడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్ అన్నారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేయాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ ఒకేషనల్ కళాశాల ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ ఒకేషనల్ కళాశాల యజమాన్యం ఫీజులు చెల్లించినా రశీదు ఇవ్వకుండా మళ్లీ ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేయడంపై మండిపడ్డారు. అధికారులు చొరవ తీసుకొని ప్రతి విద్యార్థి పరీక్ష రాసే విధంగా హాల్‌టికెట్స్ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ టౌన్ నాయకులు, శ్రీనివాస్, పవన్, కుమార్, స్వప్న, మంజుల, శోభ, స్పందన, స్వరూప, సంపూర్ణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

33 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 33 మందికి జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 33 మందిని అదుపులోనికి బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 31 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, మరో ఇద్దరికి రూ.3 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

'తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది సోనియా గాంధీనే'

న్యాల్‌కల్(జహీరాబాద్): ఎంతోమంది ఆత్మ బలిదానాలకు చలించిన సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ చీఫ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. వస్తున్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా మూడో రోజైన బుధవారం మండల పరిధిలోని రేజింతల్, మిర్జాపూర్(బి), ఖలీల్‌పూర్, బసంత్‌పూర్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలనును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమాలు చేసిన వారికి కేసీఆర్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. ప్రజాసమస్యలను పట్టించుకొని బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, న్యాల్‌కల్ పీఏసీఎస్ చైర్మన్ సిద్దిలింగయ్యస్వామి, నాయకులు హన్మనంత్‌రావు పాటిల్, భాస్కర్‌రెడ్డి, శుక్లావర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఖండేం నర్సింహులు, డాక్టర్ అశోక్ శంకర్‌పటేల్ పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

జహీరాబాద్: ఓటుహక్కును వినియోగంపై మున్సిపల్ కార్యాలయం ఆవరణలో స్వయం సహాయక సంఘాల మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మిషన్ కో–ఆర్డినేటర్ బసంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని, ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ బాధ్యతగా ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు మహిళలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

క్లుప్తంగా

బ్లాస్టింగ్‌లను నివారించండి

జిన్నారం(పటాన్‌చెరు): పంట పొలాలు, ఇళ్లకు సమీపంలో బ్లాస్టింగ్‌లు జరపటం ద్వారా తాము తీవ్రంగా నష్టపోతున్నామని బ్లాస్టింగ్‌లను నివారించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మాదారం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లాస్టింగ్‌లను నివారించాలని కోరుతూ బుధవారం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు శ్రీనివాస్, అశోక్, శివయ్య, యాదయ్య, నర్సింహులు తదితరులు మాట్లాడుతూ గ్రామ శివారులోని బొప్పనచెరువుకు సమీపంలో పంట పొలాలకు ఆనుకొని ఉన్న బండలను కొంతమంది క్రషర్‌ల నిర్వాహకులు బ్లాస్టింగ్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. బ్లాస్టింగ్‌లు జరపటంతో పంటపొలాల్లో రాళ్లు పడుతుండటంతో పాటు ఇళ్లు బీటలు వారుతున్నాయని వాపోయారు. దుమ్ము విపరీతంగా రావటంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి బ్లాస్టింగ్‌లను నివారించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పీసీబీ అధికారుల పర్యటన

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి, దోమడుగు పారిశ్రామికవాడల్లో పీసీబీ అధికారులు బుధవారం పర్యటించారు. ఈ మేరకు పీసీబీ ఈఈ కుమార్‌పాఠక్, ఏఈ అజయ్‌లు పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థ జలాల నమూనాలను సేకరించారు. నిబంధనలకు విరుద్ధంగా కాలుష్య జలాలను వదులుతున్న పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం


మిర్జాపూర్(ఎన్)లో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గుంజోటి, మిర్జాపూర్(ఎన్), రుక్మాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్లను బుధవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు మల్‌రెడ్డి, చెన్నమ్మ, స్వరూపనర్సింహారెడ్డి ప్రారంభించారు. గ్రామాల్లోని ప్రధాన చౌరస్తాల వద్ద హైమాస్ట్ లైట్లు లేకపోవడంతో రాత్రి వేళ్లలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎంపీ బీబీపాటిల్ కోరారు. అందుకు స్పందించిన ఆయన గుంజోటిలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు రూ.2లక్షలు మంజూరు చేయించారు. మిర్జాపూర్(ఎన్), రుక్మాపూర్ గ్రామాల్లో మండల పరిషత్ నిధులు రూ.2లక్షల చొప్పున రూ.4లక్షలు వెచ్చించి హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చంద్రప్ప, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, టేకూర్ సర్పంచ్ అమీర్ పాల్గొన్నారు.

కులవృత్తులను ప్రోత్సహించాలి


కుమ్మరి వృత్తి సామగ్రిని అందజేస్తున్న ఎంపీపీ రవీందర్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించాలని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. జిన్నారం మండల పరిధిలోని వావిలాల, జంగంపేట గ్రామాల్లోని కుమ్మరి వృత్తిదారులకు ఎంపీపీ రవీందర్‌గౌడ్ తన సొంత నిధులను ఖర్చుచేసి సామగ్రిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలకు రూ.లక్ష సాయం అందిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం తమ సొంత పార్టీకి చెందిన వారికి మాత్రమే అందిస్తున్నారని ఆరోపించారు. అసలైన వృత్తిదారులకు ప్రభుత్వం నుంచి సాయం అందటంలేదని వాపోయారు. కులవృత్తిదారులను ప్రోత్సహించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భార్గవ్, ఉపసర్పంచ్ నవనీత్‌రెడ్డి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

నారాయణఖేడ్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందునా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ అన్నారు. ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిని బుధవారం సందర్శించి వైద్యులు అందిస్తున్న సేవలపై రోగులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీటీసీ కిష్టయ్య కుమారుడు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతుండగా ఆయనను పరామర్శించి ఓదార్చారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

అన్నివర్గాల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


రజక సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని శివానగర్ గ్రామంలో రూ.25లక్షల నిధులతో నిర్మించిన యువజన సంఘం, రజక సంఘం భవనాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కుల సంఘాల భవన నిర్మాణాలతో పాటు యువకులను ఏకం చేసేలా యువజన సంఘ భవనాల నిర్మాణాలను చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ రేఖ, ఎంపీటీసీ సంతోషి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్


కొండాపూర్‌లో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న చింతా ప్రభాకర్

సదాశివపేట (సంగారెడ్డి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం సదాశివపేట పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు.

బతుకమ్మ చీరలు పంపిణీ

సదాశివపేట పట్టణంలోని రేషన్‌షాప్ నెంబర్ 5లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ బతుకమ్మ చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల పక్షపాతి అని తెలిపారు. మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ, వైస్‌చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు విశ్వనాథం, ఇంద్రమోహన్‌గౌడ్, విద్యాసాగర్‌రెడ్డి, రవికుమార్, శివ, కోఆప్షన్ సభ్యులు అంజయ్య, సమ్మి, జున్ను, మోబిన్ నజీర్ పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం..

కొండాపూర్(సంగారెడ్డి): మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ బుధవారం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ నరహరిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, కొండాపూర్ సర్పంచ్ రుక్మోద్దిన్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న వీరయ్య

కంది(సంగారెడ్డి): పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని ప్రజా సంఘాల రాష్ట్ర కన్వీనర్ వీరయ్య డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ ప్రజా సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కంది మండల కేంద్రంలోని 615 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు అద్దెలు చెల్లించలేక ప్రభుత్వ స్థలంలో వేసుకున్న గుడిసెలను రెవెన్యూ, పోలీసు యంత్రాంగం తొలగించడం అన్యాయమన్నారు. కందిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇతర మండలాల వారికి ఇవ్వకుండా కందిలో నివాసం ఉండే పేదలను గుర్తించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నాగయ్య, వెంకట్రాములు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామ్‌చందర్, నర్సింహులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మాణిక్, సీపీఎం నాయకులు కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

మున్సిపల్ ఛైర్మన్ పాండురంగారెడ్డి


మంచినీటి లైన్‌లను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అమీన్‌పూర్ మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు రూపశ్రీ కాంటీ, నందన్ మెడోస్, శంకర్ గ్రీన్ హోమ్స్, దుర్గప్రావిస్ కాలనీలో బుధవారం మిషన్ భగీరథ మంచినీటి లైన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్‌పూర్ మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ కొల్లూరి చంద్రకళ, కల్పన, బోయిని బాలమణి, బిజిలి రాజు, నవనీత, కవిత, కోఆప్షన్ సభ్యులు రాములు, యునుస్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శేఖర్, ఆంజనేయులు, చౌటకూరి మైపాల్‌రెడ్డి, కొల్లూరి యాదగిరి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

పటాన్‌చెరు టౌన్: ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శ్రామిక భవన్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసం వేతనం రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్లు 10రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సమతా సైనిక్‌దళ్ బాధ్యుల నియామకం**

నారాయణఖేడ్: డివిజన్ సమతా సైనిక్‌దళ్ అధ్యక్షులుగా రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గంగ్వార్ సంజీవ్‌కుమార్ నియమితులయ్యారు. బుధవారం నారాయణఖేడ్‌లో నిర్వహించిన సంఘం డివిజన్ స్థాయి సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, జిల్లా అధ్యక్షులు కరణం రవికుమార్ ఆధ్వర్యంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ **ప్రైవేటు పాఠశాలల యూనియన్ మండల అధ్యక్షుడిగా రమేష్**

హత్నూర (సంగారెడ్డి): ప్రైవేటు పాఠశాలల యూనియన్ మండల అధ్యక్షుడిగా రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు బుధవారం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రమేష్, ఉపాధ్యక్షురాలిగా ప్రశాంతి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా అనిల్, కోశాధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రటరీగా శివ, జిల్లా కమిటీ మెంబర్‌గా శ్రీనివాసరావు, కృష్ణను ఎన్నుకున్నట్లు తెలిపారు.

◆ **బచ్చుగూడెంలో అగ్ని ప్రమాదం**

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని బచ్చుగూడెం గ్రామంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాలు పూర్తిచేసుకుని వెళ్లిన తర్వాత ఎమ్మెల్యేకు స్వాగతం పలికే క్రమంలో తీసుకువచ్చిన టపాసులలో మిగిలిన వాటిని యువకులు కాల్చారు. దీంతో పక్కనే ఉన్న టెంట్‌లో మంటలు వ్యాపించాయి. సకాలంలో స్పందించిన స్థానికులు నీటితో ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

◆ **రోడ్డు పనులు ప్రారంభం**

న్యాల్‌కల్(జహీరాబాద్): గుంజోటి గ్రామానికి వెళ్లే పార్మెషన్ రోడ్డు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. గ్రామం నుంచి హద్నూర్ వెళ్లేందుకు దారి ఇరుకుగా మారడంతో సర్పంచ్ చెన్నమ్మచంద్రప్ప బుధవారం రోడ్డు పనులను ప్రారంభించారు. హద్నూర్–రాంతీర్థ్ రోడ్డు నుంచి గ్రామం వరకు పనులకు చేపట్టనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

◆ **దాడులకు పాల్పడటం సరికాదు**

సంగారెడ్డి మున్సిపాలిటీ: సిద్దిపేట్ రైల్వేస్టేషన్‌లో బీజేపీ కార్యకర్తలపై బీఆర్‌ఎస్ నాయకులు దాడికి పాల్పడం సరైందికాదని ఆ పార్టీ సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట్‌కు రైలుమార్గాన్ని మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి బీఆర్‌ఎస్ నాయకులు కృతజ్ఞతలు చెప్పాల్సింది పోయి దాడులకు పాల్పడటం శోచనీయమన్నారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు, ఎస్సీ మోర్చారాష్ట్ర కార్యవర్గ సభ్యులు కసిని వాసు తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థులకు వైద్య పరీక్షలు**

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని ఎస్సీ, వసతి గృహంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కల్పన ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత తదితరాలపై అవగాహన కల్పించారు. జ్వరం, దగ్గు ఇతర అనారోగ్య సమయంలో ఉపయోగించే మందులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వార్డెన్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి**

కొండాపూర్(సంగారెడ్డి): ప్రైవేట్ రవాణా, ఆటో టాక్సీ డ్రైవర్‌ల సమస్యలను పరిష్కరించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కొండాపూర్‌లోని బీఎంఎస్ కార్యాలయంలో బుధవారం ఆటో, టాక్సీ డ్రైవర్‌ల మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన నిర్వహించే మహాసభలకు ఆటో, టాక్సీ డ్రైవర్‌లు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

◆ **గ్రామ అభివృద్ధికి సహకరించాలి**

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని సర్పంచ్ మారుతి యాదవ్ అన్నారు. మండల పరిధిలోని మల్గి గ్రామ సమీపంలోని నవనాథ్ సిద్ధిలింగేశ్వర ఆలయం నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఎంపీటీసీ శివానంద శ్రీపతి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్దారెడ్డి, విఠల్, రమేష్ పాల్గొన్నారు.

◆ **ఉన్నత స్థాయికి ఎదగాలి**

కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కల్హేర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అసద్ ఫారుఖ్ బమహెది అన్నారు. బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది సైదులు, రాజేశ్, ఉమపతి, మాధవి పాల్గొన్నారు.

◆ **విద్యుత్ స్తంభాల ఏర్పాటు**

నారాయణఖేడ్: మండలంలో బుధవారం విద్యుత్‌కు సంబంధించి వివిధ పనులను ముమ్మరంగా చేపట్టారు. అవసరాల మేరకు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్ల ఏర్పాటు, ప్రమాదకరంగా మారిన స్తంభాలు, లోవోల్టేజీ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు తదితర పనుల కోసం ఖేడ్ నియోజకవర్గానికి ఇటీవల రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పనులను చేపట్టారు. పలుగుతండాలో నిర్వహిస్తున్న పనులను జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్ పర్యవేక్షించారు.

◆ **సమస్యలు పరిష్కరించాలి**

వట్‌పల్లి(అందోల్): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. జోగిపేటలో మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరం వద్ద ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసి కొత్త మెనూ జారీ చేయాలన్నారు. అదేవిధంగా కార్మికులకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, మధ్యాహ్నం భోజన కార్మికులు సావిత్రి, మరియమ్మ, రత్నమ్మ, పుష్పమ్మ, లక్ష్మి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

◆ **బాధిత కుటుంబాలకు పరామర్శ**

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి బుధవారం పరామర్శించారు. దౌలాపూర్ గ్రామానికి చెందిన మత్స్యకారుడు చింత లింగమయ్య చేపల వేటకు వెళ్లి మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కాసాల గ్రామంలో ఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశం తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రావులకోరి వెంకటమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ మండల నాయకుడు అభిబాబా తల్లి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట ఎంపీపీ వావిలాల నరసింహులు, జెడ్పీటీసీ ఆంజనేయులు, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు ఉన్నారు.